

పండుగకు ప్రత్యేక బస్సులు

ఆర్టీసీని లాభాల బాటలోకి తెచ్చేందుకు యాజమాన్యం చర్యలు చేపడుతోంది. సంక్రాంతి పండుగకు ప్రత్యేక బస్సులు నడిపేందుకు సమాయత్తమవుతోంది. 8లో▸



కలెక్టర్‌కు శుభాకాంక్షలు

కైలాస్‌నగర్: నూతన సంవత్సరం పురస్కరించుకుని పూర్వ వీఆర్‌ఏలు కలెక్టర్ రాహుల్‌రాజ్, అదనపు కలెక్టర్ శ్యామలాదేవీలను బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. కలెక్టరేట్‌లోని వారి చాంబర్లలో కలిసి శాలువాతో సన్మానించారు.

గరిష్టం/కనిష్టం
29.0/17.0

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. గాలిలో తేమశాతంతో పాటు రాత్రి వేళలో చలితీవ్రత పెరగనుంది.

న్యూస్‌రీల్

సీఎంను కలిసిన ఖానాపూర్ ఎమ్మెల్యే



సీఎంకు పూలమొక్క అందజేస్తున్న ఎమ్మెల్యే బొజ్జు

ఉట్నూర్‌రూరల్: నూతన సంవత్సరం సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డిని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు సచివాలయంలో బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు.మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సత్తు మల్లేశ్ ఉన్నారు.

మంత్రి సీతక్కను కలిసిన 'సమగ్ర' ఉద్యోగులు



మంత్రికి వినతిపత్రాన్ని అందజేస్తూ..

ఆదిలాబాద్‌టౌన్: తెలంగాణ సమగ్ర శిక్షలో పనిచేస్తున్న ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని కోరుతూ ఆ సంఘం నాయకులు పంచాయతీరాజ్, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్కను కలిశారు. బుధవారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రం సమర్పించారు. అలాగే విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్ర వెంకటేశం, టీపీసీసీ అధికార ప్రతినిధి హర్షవర్ధన్ రెడ్డిలను కలిసి సమస్యలను విన్నవించారు. ఉద్యోగులకు మినిమం పేస్కేల్, సర్వీసును క్రమబద్ధీకరించాలని కోరారు. వినతి పత్రాన్ని సమర్పించిన వారిలో సంఘం నాయకులు యాదగిరి, శ్రీనివాస్, రవిందర్, నాగార్జున, రాజు, పాషా తదితరులున్నారు.

'ప్రజాపాలన' దరఖాస్తులు 1,37,365

కైలాస్‌నగర్: ప్రభుత్వం అమలు చేయనున్న అభయహస్తం ఆరు గ్యారంటీల దరఖాస్తుల సంఖ్య బుధవారంతో లక్ష దాటింది. ప్రజా పాలనలో భాగంగా జిల్లాలోని గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలోని 49 వార్డుల్లో అధికారులు అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ప్రతి రోజు వేలల్లో అందుతున్నాయి. ఐదో రోజు గ్రామ పంచాయతీల్లో 33,365 దరఖాస్తులు అందగా ఆదిలాబాద్ మున్సిపల్ పరిధిలో 4,381 కలిపి మొత్తం 37,946 దరఖాస్తులు అందాయి. మొత్తంగా ఇప్పటి వరకు గ్రామ పంచాయతీల్లో 98,092 దరఖాస్తులు, మున్సిపాలిటీలో 39,273 కలిపి 1,37,365కి చేరాయి. ఇతర పథకాల కోసం గ్రామ పంచాయతీల్లో 5,804, మున్సిపల్‌లో 49 చొప్పున 5,853 దరఖాస్తులు వచ్చాయి. వీటిని కలిపితే ఇప్పటి వరకు గ్రామ పంచాయతీల్లో 13,388 మున్సిపల్‌లో 266 చొప్పున 13,654 దరఖాస్తులు అందినట్లు కలెక్టర్ రాహుల్‌రాజ్ తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఆదిలాబాద్‌రూరల్: తెలంగాణ ప్రభుత్వ ఆధ్వర్యంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, జనరల్ గురుకుల పాఠశాలల్లో 2024–25 విద్యా సంవత్సరానికి గాను ఐదో తరగతిలో ప్రవేశాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ డీసీవో శ్రీనివాస్ ప్రకటనలో తెలిపారు. 2023–24 విద్యా సంవత్సరంలో 4వ తరగతి చదువుతున్న విద్యార్థులు అర్హులు అని పేర్కొన్నారు. జనవరి 6 వరకు రూ.100 రుసుము చెల్లించి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఉమ్మడి ప్రవేశ పరీక్ష ఫిబ్రవరి 11న ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఉంటుందని పేర్కొన్నారు. తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.



జిల్లా కేంద్రంలోని ఈ పాఠశాల వెంకట్‌రావుకాలనీలో ఉంది. ఇందులో ఇదివరకు 1నుంచి 5వ తరగతి వరకు విద్యాబోధన జరిగేది. ఐదారేళ్లుగా ఈ బడి మూతబడింది. గతంలో విద్యార్థులు ఉండగా, ఉపాధ్యాయుల కొరత వెంటాడింది. వేరే పాఠశాల నుంచి ఒక ఉపాధ్యాయుడిని సర్దుబాటు చేశారు. అయితే ఆ ఉపాధ్యాయుడు సెలవు పెడితే విద్యార్థులకు సెలవే అన్నట్టుగా మారింది. దీంతో తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేట్ పాఠశాలలకు పంపించడంతో క్రమంగా ఇందులో విద్యార్థుల సంఖ్య తగ్గింది. దీంతో పాఠశాలను అప్పట్లో ప్రభుత్వం మూసివేయింది.



ఆదిలాబాద్‌లోని భుక్తాపూర్ కాలనీలో గల ప్రభుత్వ పాఠశాల ఇది. ఇందులో 1 నుంచి 5వ తరగతి వరకు బోధన సాగేది. ఉపాధ్యాయుల కొరత కారణంగా ఇతర పాఠశాలల నుంచి రెండేళ్ల పాటు సర్దుబాటు ద్వారా ఓ ఉపాధ్యాయుడిని కేటాయించి తరగతులు కొనసాగించారు. టీచర్లు లేకపోవడం, పాఠశాల భవనం శిథిలావస్థకు చేరడం, విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉండడంతో ఐదారేళ్ల క్రితం ఈ పాఠశాలను మూసివేశారు.

మూత బడులు తెరిచేలా..

- విద్యాశాఖ కసరత్తు
- జిల్లాలో ఈ జాబితాలో పది
- టీచర్ల కొరతతోనే తల్లిదండ్రుల అనాసక్తి

జిల్లాలో..
ప్రభుత్వ పాఠశాలలు : 692
మూతబడిన పాఠశాలలు : 10
పనిచేస్తున్న ఉపాధ్యాయులు: 2,482
ఉపాధ్యాయ ఖాళీలు : 546
ఏకోపాధ్యాయ పాఠశాలలు : 80



ఇచ్చోడ మండలం తలమద్రిలోని ఉన్నత పాఠశాల ఇది. ఇందులో నలుగురు విద్యార్థులు ఉండడంతో విద్యాశాఖ అధికారులు ఈ పాఠశాలలో ఉన్న విద్యార్థులను చుట్టుపక్కల బడుల్లో చేర్చారు. ఇక్కడ పనిచేసే ఉపాధ్యాయులను అవసరం ఉన్న చోటుకు డిప్యూటేషన్‌పై పంపించారు. దీంతో ఈ గ్రామంలో ఉన్నత పాఠశాల లేకుండా పోయింది.

ఆదిలాబాద్‌టౌన్: ప్రతి ఊరిలో బడి ఉండాలని.. ఇదివరకు మూతబడిన సర్కారు బడులను పునఃప్రారంభించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇటీవల అధికారులతో నిర్వహించిన సమీక్షించలో ఆదేశించారు. ఈ పాఠశాలలను తెరిపించేలా విద్యాశాఖాధికారులు కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. పేద విద్యార్థులకు విద్య అందుబాటులో ఉండాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. తప్పనిసరిగా ప్రతి గ్రామంలో పాఠశాల ఉండాలని, ఏయే గ్రామాల్లో పాఠశాలలు లేవో వివరాలు సేకరించే పనుల్లో అధికారులు నిమగ్నమైనట్లు సమాచారం. విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉందనే కారణంతో గతంలో అధికారులు ఆయా పాఠశాలలను మూసివేసిన విషయం తెలిసిందే. జిల్లాలో తొమ్మిది ప్రాథమిక పాఠశాలలతో పాటు ఒక ఉన్నత పాఠశాల మూతబడింది. ప్రభుత్వ నిర్ణయంతో మళ్లీ ఈ బడులను ప్రారంభించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఆఊరిలో,కాలనీల్లో ఉన్న బడులు పునః ప్రారంభం కానుండడంతో విద్యార్థులకు మేలు చేకూరనుంది.

కొట్టుమిట్టాడుతున్న సమస్యలు..

జిల్లాలో 467ప్రాథమిక, 119 ప్రాథమికోన్నత, 106 ఉన్నత పాఠశాలలున్నాయి. జిల్లా వ్యాప్తంగా డీఈవో పరిధిలో 692 పాఠశాలలు పనిచేస్తున్నాయి. వీటిలో 65వేల మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. జిల్లాలో చాలా బడులు సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నాయి. ప్రహరీలు లేకపోవడం, తాగునీరు, మరుగుదొడ్లు, బెంచీలు, విద్యుత్ సౌకర్యం, ఫ్యాన్లు తదితర సమస్యలు రాజ్యమేలుతున్నాయి. వీటిని పక్కనబెడితే విద్యాబోధన చేసే గురువులు సైతం లేకపోవడంతో విద్యార్థులు ఇక్కట్లు తప్పడం లేదు. ప్రాథమిక పాఠశాలల్లోని ఉపాధ్యాయులను ఉన్నత పాఠశాలలు, సమీపంలోని బడుల్లో సర్దుబాటు చేయడంతో పూర్తిస్థాయిలో విద్యార్థులకు తరగతులు బోధించలేని పరిస్థితి. చాలా పాఠశాలల్లో ఒకరిద్దరు ఉపాధ్యాయులు ఉంటే వారు రెండుమూడు తరగతుల విద్యార్థులను ఒకేచోట కూర్చోబెట్టి బోధిస్తున్నారు. దీంతో చిన్నారులకు ఏమి అర్థం కాని పరిస్థితి. ఈ క్రమంలో ప్రాథమిక విద్యావ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది.

జిల్లాలో పది బడుల మూత..

జిల్లాలో గతంలో పది పాఠశాలలు మూతబడ్డాయి. ఇందులో ఆదిలాబాద్ పట్టణంలోని వెంకట్‌రావు కాలనీ, భుక్తాపూర్, స్టేషన్ రోడ్, కేఆర్‌కే కాలనీలోని హిందీ మీడియం, బజార్‌హత్నూర్‌లోని ఇందిరానగర్, భీంపూర్‌లోని పిప్పల్‌కోటి ఉర్దూ మీడియం, గాదిగూడలోని చిన్నకుండి, నార్నూర్‌లోని భీంపూర్ ఎస్సీ కాలనీ, నేరడిగొండ మండలం దర్బ ప్రాథమిక పాఠశాలలు, అలాగే ఇచ్చోడ మండలం తలమద్రి ఉన్నత పాఠశాల ఉన్నాయి.

80 పాఠశాలల్లో ఏకోపాధ్యాయులు..

జిల్లాలోని 80 పాఠశాలలు ఏకోపాధ్యాయులతో కొనసాగుతున్నాయి. వీటిలో ముగ్గురు నుంచి పది మంది వరకు విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. ఈ పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయుడు సెలవు పెడితే విద్యార్థులకు సైతం సెలవే అన్న పరిస్థితి. ఆదిలాబాద్‌అర్బన్, బజార్‌హత్నూర్, బేల, బోథ్, గాదిగూడ, గుడిహత్నూర్, ఇచ్చోడ, ఇంద్రవెల్లి, జైనథ్, నేరడిగొండ, సిరికొండ, తలమడుగు, ఉట్నూర్ మండలాల్లోని ఆయా గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలల్లో ఈ దుస్థితి ఉంది. ఉపాధ్యాయులు లేకపోవడంతో తల్లిదండ్రులు సర్కారు బడులకు తమ పిల్లలను పంపించేందుకు ఆసక్తి చూపడం లేదు. జిల్లాలో 546 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దీనికితోడు ఇటీవల ప్రాథమిక పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులను ఉన్నత పాఠశాలలకు సర్దుబాటు చేయడంతో పూర్తి స్థాయిలో విద్యార్థులకు విద్యాబోధన సాగడం లేదు.

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు..

జిల్లాలో మూతబడ్డ పాఠశాలలను తెరిపించేందుకు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటాం. ప్రస్తుతం పది పాఠశాలలు మూతపడ్డాయి. వీటిలో తొమ్మిది ప్రాథమిక, ఒక ఉన్నత పాఠశాల ఉన్నాయి. ప్రభుత్వం నుంచి ఇప్పటివరకు ఎలాంటి ఆదేశాల రాలేదు. – ప్రణీత, డీఈవో

'అభయహస్తం'కు దరఖాస్తు చేసుకోండి

- కలెక్టర్ రాహుల్‌రాజ్

తాంసి: ప్రజాపాలనలో భాగంగా అభయహస్తంలో భాగంగా ఆరు గ్యారంటీల కోసం అర్హులైన ప్రతి కుటుంబం దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ కోరారు. మండలంలోని పొన్నారిలో నిర్వహించిన గ్రామసభలో దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను కలెక్టర్ బుధవారం పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజాపాలనలో భాగంగా గడిచిన నాలుగు రోజుల్లో జిల్లా వ్యాప్తంగా లక్ష వరకు దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. గ్రామసభల ద్వారా దరఖాస్తు చేసుకోలేని వారు ఆందోళన చెందకుండా ఈనెల 6వరకు పంచాయతీ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. కుటుంబ సభ్యులతో కలిసి ఉండే వారు రేషన్‌కార్డులో పేర్లు లేకున్నా ఒకే దరఖాస్తులో పేర్లను చేర్చి దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఒకవేళ వేరుగా ఉండే వారు ఐదు గ్యారంటీలతో పాటు రేషన్‌కార్డుకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇందులో ఎంపీడీవో భూమయ్య, సీపీవో వెంకటరమణ, సర్పంచ్ అశోక్, వైస్‌ఎంపీపీ ముచ్చ రేఖ రఘు, ఎస్సై శివరాం, పంచాయతీ కార్యదర్శి విజయ్, గ్రామపెద్దలు తదితరులున్నారు.



పొన్నారిలో దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

పకడ్బందీగా దరఖాస్తుల స్వీకరణ

ఇచ్చోడ: ప్రభుత్వం ఆరు గ్యారంటీల అమలు కోసం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ప్రజాపాలనలో భాగంగా దరఖాస్తులు పకడ్బందీగా స్వీకరించాలని అదనపు కలెక్టర్ ఖుష్బూ గుప్తా అన్నారు. మండలంలోని సిరిచెల్మలో బుధవారం నిర్వహించిన గ్రామసభలో దరఖాస్తుల స్వీకరణ ప్రకియను పరిశీలించి అధికారులతో మాట్లాడారు. ఆరు గ్యారంటీల కోసం ప్రజల నుంచి వస్తున్న దరఖాస్తుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ నెల 6 వరకు గ్రామ సభలు ద్వారా అర్హులైన వారి నుంచి దరఖాస్తులు స్వీరించాలన్నారు. అలాగే దరఖాస్తు ఫారాల కొరత లేకుండా చూడాలన్నారు. వారి వెంట ఎంపీడీవో రాంప్రసాద్, అధికారులు, సిబ్బంది ఉన్నారు.

ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి బదిలీ

- జిల్లాలో రెండేళ్లపాటు విధులు
- నూతన ఎస్పీగా గౌస్ ఆలమ్
- ములుగు నుంచి జిల్లాకు రాక



బదిలీ అయిన ఎస్పీ డి.ఉదయ్‌కుమార్‌రెడ్డి



జిల్లాకు నూతన ఎస్పీగా వస్తున్న గౌస్ ఆలమ్

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా ఎస్పీ డి.ఉదయ్‌కుమార్ రెడ్డి బదిలీ అయ్యారు. పోలీసు అధికారుల సాధారణ బదిలీల్లో భాగంగా బుధవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. రాష్ట్ర వ్యాప్తంగా 24 మంది ఐపీఎస్‌లకు బదిలీలు జరగగా, ఇందులో జిల్లా ఎస్పీకి కూడా స్థానచలనం కలిగింది. ఉదయ్‌కుమార్ రెడ్డిని ట్రాన్స్‌కో ఎస్పీగా బదిలీ చేశారు. కాగా ఈయన జిల్లాలో రెండేళ్ల పాటు పనిచేశారు. మంచిర్యాల ఏసీపీగా విధులు నిర్వహిస్తూ 2021 డిసెంబర్ 27న పదోన్నతి పొంది జిల్లా ఎస్పీగా వచ్చారు.

గుట్కా, మట్కాపై ఉక్కుపాదం..

ఎస్పీగా ఉదయ్‌కుమార్‌రెడ్డి జిల్లాలో మట్కా, గుట్కా, గంజాయిపై ఉక్కుపాదం మోపారు. అలాగే రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. కేంద్రప్రభుత్వం నిర్వహించిన సర్వేలో ఈయన హయాంలో గతేడాది ఆదిలాబాద్ జిల్లా సురక్షితమైన ప్రాంతంగా అవార్డు కైవసం చేసుకుంది.

కొత్త ఎస్పీగా ఐపీఎస్ గౌస్ ఆలమ్..

జిల్లా ఎస్పీగా గౌస్ ఆలమ్ నియమితులయ్యారు. 2017 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన ఈయన ప్రస్తుతం ములుగు ఎస్పీగా పనిచేస్తున్నారు. అంతకుముందు అక్కడే ఓఎస్‌డీగా విధులు నిర్వహించారు. కాగా అంతకుముందు ఏటూరు నాగారంలో అడిషనల్ ఎస్పీగా పనిచేశారు. ఈయన బిహార్ రాష్ట్రంలోని గయాకు చెందినవారు. ఐఐటీ ముంబాయ్‌లో గ్రాడ్యుయేట్ పట్టా పొందారు. ఆలాం ఐపీఎస్ ట్రైనింగ్‌లో పరేడ్ కమాండర్‌గా వ్యవహరించడంతో పాటు బెస్ట్ ఆల్ రౌండర్, బెస్ట్ ఫైరర్ అవార్డులను కేంద్ర హోం మంత్రి అమిత్ షా చేతులమీదుగా అందుకున్నారు.

బీఆర్‌ఎస్‌కు జెడ్పీ చైర్మన్ గుడ్‌బై

- పార్టీకి రాజీనామా చేసిన జనార్దన్ రాథోడ్
- కాంగ్రెస్‌లో చేరేందుకు రంగం సిద్ధం
- ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్కతో భేటీ



జనార్దన్ రాథోడ్, జెడ్పీ చైర్మన్

కైలాస్‌నగర్: పార్లమెంట్ ఎన్నికల వేళ బీఆర్‌ఎస్‌కు జిల్లాలో గట్టి షాక్ తగిలింది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి ఇప్పటికే ఆ పార్టీకి రాజీనామా ప్రకటించగా.. తాజాగా జెడ్పీ చైర్మన్ జనార్దన్ రాథోడ్ సైతం పార్టీకి గుడ్‌బై చెప్పారు. ఈ మేర కు బుధవారం పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీ నామా చేశారు. తన రాజీనామా పత్రాన్ని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కేసీఆర్, జిల్లా అధ్యక్షుడు జోగు రామన్నకు ఫ్యాక్స్ ద్వారా పంపించారు. డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, జైనథ్ జెడ్పీటీసీ తుమ్మల అరుంధతి–వెంకట్ రెడ్డితో కలిసి కాంగ్రెస్‌లో చేరేందుకు జనార్దన్ రాథోడ్ బుధవారం హైదరాబాద్‌కు బయలుదేరి వెళ్లారు. సీఎం రేవంత్‌ను కలిసేందుకు రోజంతా ప్రయత్నించినప్పటికీ వారికి అపాయింట్‌మెంట్ లభించలేదు. కాగా రాత్రి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్కతో భేటీ అయ్యారు. త్వరలోనే వారు కాంగ్రెస్ కండువా కప్పుకోనున్నట్లు సమాచారం.

విస్తృతంగా షీటీమ్ కార్యక్రమాలు

- పాఠశాలలు, కళాశాలలు, పార్కుల్లో ప్రత్యేక నిఘా
- ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి



మాట్లాడుతున్న ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాలో భయాందోళనలు లేకుండా సమర్థవంతంగా షీటీమ్ బృందాలు పనిచేయాలని ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి అన్నారు. పోలీసు కార్యాలయంలో షీటీమ్ బృందాలతో బుధవారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. జిల్లాలో రెండు షీటీమ్ బృందాలు పనిచేస్తున్నాయని, గతేడాది 438 అవగాహన కార్యక్రమాలు నిర్వహించామన్నారు. 97 కౌన్సెలింగ్ ద్వారా 16 ఎఫ్‌ఐఆర్ కేసులు నమోదు చేశారని, అలాగే 86 పీటీ కేసులు నమోదైనట్లు తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఈ ఏడాది నుంచి పాఠశాలలు, కళాశాలలు, పార్కులు, జాతరల్లో షీటీమ్ బృందాల ద్వారా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. విద్యార్థులు మత్తు పదార్థాలు, సైబర్ మోసాల బారిన పడకుండా చూస్తున్నట్లు తెలిపారు. బస్టాండ్, రైల్వేస్టేషన్, ప్రజలు గుమిగూడే ప్రాంతాల్లో మహిళలకు రక్షణగా షీటీమ్‌లు పనిచేస్తాయన్నారు. సమావేశంలో డీసీఆర్బీ డీఎస్పీ శ్రీనివాస్, సీఐ రవీందర్, సిబ్బంది శ్రీనివాస్, వినోద్, వాణిశ్రీ, సుశీల, సత్యమోహన్, భాగ్య తదితరులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు ఎంప్లాయ్ ఐడీలు

- ట్రెజరీలో కసరత్తు
- వారం రోజుల్లో అందేలా చర్యలు
- పూర్వ వీఆర్‌ఏల హర్షం

జిల్లాలో ఆయా శాఖలకు కేటాయించిన పూర్వ వీఆర్‌ఏల వివరాలు..	
జూనియర్ అసిస్టెంట్లు	76
రికార్డు అసిస్టెంట్లు	68
ఆఫీస్ సబార్డినేట్లు	99
చైన్‌మెన్‌లు	19
హెల్పర్లు	28
వార్డు ఆఫీసర్లు	07
లష్కర్లు	11
పబ్లిక్ హెల్త్‌వర్కర్లు	11
రెనో ఆపరేటర్లు	02
వాచ్‌మెన్లు	05



వివరాలు నమోదు చేస్తున్న ట్రెజరీ ఉద్యోగి

కైలాస్‌నగర్: ప్రభుత్వ శాఖల్లో సర్దుబాటు అయిన పూర్వ వీఆర్‌ఏల నిరీక్షణ ఎట్టకేలకు ఫలించింది. ఆరు నెలలుగా వేతనాలు అందక ఆర్థిక ఇబ్బందులు పడుతున్న వారికి ఎంప్లాయ్ ఐడీల జారీకి ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ట్రెజరీ అధికారులు ఎంప్లాయ్ ఐడీలు, ప్రాన్ నంబర్ల జారీ కసరత్తు ప్రక్రియ ప్రారంభించారు. జిల్లాలో 327 మంది వీఆర్‌ఏలు వివిధ శాఖల్లో సర్దుబాటు కాగా 200 మందికి సంబంధించిన దరఖాస్తులు ఇప్పటి వరకు తమకు అందినట్లుగా సంబంధిత అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వ నిర్ణయంపై పూర్వ వీఆర్‌ఏలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఇదీ పరిస్థితి...

రెవెన్యూశాఖలో వీఆర్‌ఏగా పనిచేస్తున్న వారిని ఉద్యోగులుగా గుర్తించిన గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం వివిధ శాఖల్లో వారిని సర్దుబాటు చేసింది. జిల్లాలోని 327 మందిని వారి విద్యార్హతల ప్రకారం జూనియర్ అసిస్టెంట్లు, రికార్డు అసిస్టెంట్లు, అటెండర్లు తదితర పోస్టుల్లో మున్సిపల్, ఇరిగేషన్, పంచాయతీరాజ్ , రెవెన్యూ, వైద్య ఆరోగ్యశాఖల్లో సర్దుబాటు చేసింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆగస్టు 10న వారు తమకు కేటాయించిన శాఖల్లో విధుల్లో చేరారు. ఆరు నెలలుగా సేవలందిస్తున్నారు. అయితే అప్పటి ప్రభుత్వం వారికి ఎంప్లాయ్ ఐడీలు కేటాయించకపోవడంతో వేతనాలు చెల్లించలే ని పరిస్థితి ఏర్పడింది. దీంతో వారు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు.ఈక్రమంలో తమకున్యాయం చేయాలని కొత్త ప్రభుత్వాన్ని వేడుకుంటూ వస్తున్నారు.

ప్రారంభమైన ప్రక్రియ


పూర్వ వీఆర్‌ఏల దీనస్థితిని గుర్తించిన ప్రభుత్వం సర్దుబాటు అయిన ఉద్యోగులందరికీ ఎంప్లాయ్ ఐడీలను జారీ చేయాల్సిందిగా ఆదేశాలు జారీ చేసింది. ఈమేరకు ఉద్యోగుల సమగ్ర సమాచారాన్ని దరఖాస్తుల ద్వారా స్వీకరించిన ట్రెజరీ అధికారులు వాటిని సంబంధిత వెబ్‌సైట్‌లో నమోదు చేస్తున్నారు. జిల్లాకు సంబంధించిన వారందరి ఎంప్లాయ్ ఐడీలను జిల్లా కేంద్రంలోని ట్రెజరీ శాఖ డిప్యూటీ డైరెక్టర్ కార్యాలయం నుంచి జారీ చేయనున్నారు. ఈ జారీ పూర్తయ్యాక పర్మినెంట్ రిటైర్మెంట్ అకౌంట్ నంబర్ (పీఆర్‌ఏఎన్)ను జిల్లా కేంద్రంతో పాటు ఉట్నూర్, బోథ్ సబ్ ట్రెజరీ కార్యాలయా ల నుంచి జారీ చేయనున్నారు. వారంలోగా వాటిని జారీ చేసేలా అధికారులు కసరత్తు చేస్తున్నారు.

ప్రభుత్వ ఆదేశాలు అందాయి

ప్రభుత్వ శాఖల్లో సర్దుబాటు అయిన పూర్వ వీఆర్‌ఏలకు ఎంప్లాయ్ ఐడీ, ప్రాన్ నంబర్లను జారీ చేయాలంటూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. తదనుగుణంగా ప్రక్రియ ప్రారంభించాం. వారంలోగా ఉద్యోగులందరికి వాటిని అందించేలా దృష్టి సారించాం. – నిహారిక, ట్రెజరీశాఖ డిప్యూటీ డైరెక్టర్

మార్కెట్‌కు పోటెత్తిన పత్తి

- ఈ సీజన్‌లో రికార్డుస్థాయిలో బండ్ల రాక
- ఆదిలాబాద్ ఏఎంసీలో రాత్రి వరకు కొనుగోళ్లు



మార్కెట్ యార్డులో బారులుతీరిన పత్తి వాహనాలు

సాక్షి,ఆదిలాబాద్: ఈ పత్తి సీజన్‌లో ఆదిలాబాద్ మార్కెట్‌లో బుధవారం రికార్డు స్థాయిలో కొనుగోళ్లు జరిగాయి. సుమారు 1300కు పైగా వాహనాల్లో 25వేల క్వింటాళ్ల వరకు పత్తి విక్రయాలు జరిగినట్లు అధికారులు చెబుతున్నారు. రాత్రి వరకు క్రయ విక్రయాలు కొనసాగాయి. రెండు మూడు రోజులు వరుసగా సెలవులు రావడంతో మార్కెట్లో పత్తి కొనుగోళ్లు నిలిచాయి. ఈ క్రమంలో ఇటు సీసీఐ, అటు ప్రైవేట్ కొనుగోళ్లు జరగడంతో పెద్ద ఎత్తున రైతులు పత్తిని మార్కెట్‌కు తీసుకొచ్చారు.

జిల్లాలో ఇదీ పరిస్థితి..

జిల్లాలో పత్తి కొనుగోళ్లు గతేడాది అక్టోబర్ 30న ప్రారంభమయ్యాయి. ఆదిలాబాద్, బోథ్, ఇంద్రవెల్లి, ఇచ్చోడ, జైనథ్ వ్యవసాయ మార్కెట్ కమిటీల పరిధిలో 13 సీసీఐ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసింది. ప్రైవేట్ వ్యాపారులు కూడా కొనుగోలు చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర క్వింటాలుకు రూ.7,020 ఉంది. పత్తిలో తేమ ఆధారంగా ప్రైవేట్ వ్యాపారులు మద్దతు ధర తగ్గిస్తున్నారు. దీంతో సీసీఐ రంగంలో ఉన్నప్పటికీ అధిక తేమ పేరిట మార్కెట్‌కు వచ్చిన పత్తిలో పూర్తి స్థాయిలో కొనుగోలు చేయడం లేదు. జిల్లాలో ఇప్పటివరకు ప్రైవేట్ వ్యాపారులు 3లక్షల 9వేల క్వింటాళ్లు కొనుగోలు చేయగా, సీసీఐ 5లక్షల 34వేల 510 క్వింటాళ్లు కొనుగోలు చేయడం గమనార్హం.

క్లుప్తంగా

తండ్రిపై దాడిచేసిన తనయుడిపై కేసు

ఆదిలాబాద్‌టౌన్: తండ్రిపై దాడికి పాల్పడిన తనయుడిపై టూటౌన్ పోలీసు స్టేషన్‌లో బుధవారం కేసు నమోదైనట్లు ఏఎస్సై జయలక్ష్మి తెలిపారు. ఆదిలాబాద్ పట్టణంలోని సంజయ్‌నగర్‌కు చెందిన రిటైర్డ్ పోలీసు అధికారి కోవ పాచ్చిరాంపై అతని కుమారుడు మనోహర్ డబ్బులు ఇవ్వాలని వేధించడంతో పాటు దాడికి దిగినట్లు ఆమె పేర్కొన్నారు. పాచ్చిరాం ఫిర్యాదు మేరకు మనోహర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై వివరించారు.

మట్కా నిర్వాహకుల అరెస్టు



పట్టుబడిన నిర్వాహకులు

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని తాంసి బస్టాండ్ ప్రాంతంలో మట్కా నిర్వహిస్తున్న ముగ్గురిని బుధవారం సీసీఎస్ పోలీసులు పట్టుకున్నారు. మట్కా నిర్వహిస్తున్నట్లు సమాచారం రావడంతో దాడులు నిర్వహించారు. షబ్బీర్, వసీం అక్తర్, సయ్యద్ ఇక్బాల్‌లను అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.2,300 నగదు, మట్కా చిట్టీలు, మొబైల్ ఫోన్లు, ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నారు. టుటౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు సీసీఎస్ సీఐ సాయినాథ్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు



గాయాలపాలైన రమేశ్

లక్ష్మణచాంద: రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలైన సంఘటన మండలంలోని మల్లాపూర్ సమీపంలో బుధవారం చోటు చేసుకుంది. మండల కేంద్రానికి చెందిన రమేశ్ నడుచుకుంటూ మల్లాపూర్ వైపు వెళ్తుండగా ద్రోణ పాఠశాల సమీపంలో ద్విచక్ర వాహనం ఢీకొట్టడంతో కుడిచేయి, ఎడమకాలు విరిగింది. సమాచారం తెలుసుకున్న 108 సిబ్బంది ప్రథమ చికిత్స అనంతరం క్షతగాత్రుడిని ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈఎంటీ సురేష్, పైలట్ అజార్ ఉన్నారు.

బొలెరో వాహనం బోల్తా



రోడ్డుపై చిందరవందరగా నారింజ పండ్లు

నేరడిగొండ: మండలంలోని కుప్టి జాతీయ రహదారిపై బుధవారం తెల్లవారుజామున నారింజ (ఆరెంజ్) లోడ్‌తో వెళ్తున్న బొలెరో వాహనం బోల్తా పడింది. నాగ్‌పూర్ నుంచి హైదరాబాద్‌కు ఈ వాహనం వెళ్తుండగా కుప్టి బ్రిడ్జి వద్ద ఈ ప్రమాదం చోటు చేసుకుంది. దీంతో వాహనంలోని నారింజ పండ్లు రోడ్డుపై చిందరవందరగా పడ్డాయి. వాహనాన్ని డ్రైవర్ ఇతరుల సహాయంతో లేపి నాగ్‌పూర్‌కు బయల్దేరి వెళ్లారు. కాగా పండ్లు అక్కడే వదిలేసి వెళ్లిపోవడంతో జనాలు ఉదయం వాటిని తీసుకెళ్లారు.

పండుగకు ప్రత్యేక బస్సులు

- సంక్రాంతికి ఆదిలాబాద్ రీజియన్ నుంచి సౌకర్యం
- ఈ నెల 7 నుంచి 13 వరకు 248 స్పెషల్ బస్సులు



మంచిర్యాల బస్‌స్టేషన్‌లో ప్రయాణికుల రద్దీ

మంచిర్యాలఅర్బన్: ఆర్టీసీ సంస్థను లాభాల బాటలోకి తెచ్చేందుకు యాజమాన్యం అందివచ్చిన అవకాశాలు సద్వినియోగం చేసుకుంటోంది. ఇందులో భాగంగా ఆర్టీసీ యాజమాన్యం సంక్రాంతి పండుగకు ప్రత్యేక బస్సులు నడిపేందుకు సమాయత్తమవుతోంది. సంక్రాంతికి విద్యార్థులకు సెలవులు వస్తున్నాయి. దైవదర్శనాలు, పండుగ సందళ్లు మొదలుకానున్నాయి. ఈ నేపథ్యంలో రాకపోకలు పెరుగనున్నాయి. ప్రయాణికుల రద్దీ దృష్ట్యా, వారి సౌకర్యార్థం తెలంగాణ ఆర్టీసీ ఆదిలాబాద్ రీజియన్ నుంచి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసింది. ఉద్యోగ రీత్యా హైదరాబాద్‌కు వెళ్లినవారు.. చదువుల నిమిత్తం నగరంలో ఉన్న విద్యార్థులంతా సంక్రాంతి సెలవులకు స్వగ్రామాలకు వస్తుంటారు. ఈ నేపథ్యంలోనే ఆదిలాబాద్ రీజియన్ నుంచి ఆర్టీసీ 248 ప్రత్యేక (స్పెషల్ బస్సులు) బస్సులు నడిపేందుకు చర్యలు చేపట్టింది.

ఈ నెల 7 నుంచి 13 వరకు..

ఉమ్మడి జిల్లాలోని ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల, ఆసిఫాబాద్, ఉట్నూర్ డిపోల నుంచి ప్రత్యేక బస్సులు నడపనున్నారు. భైంసా డిపో నుంచి మినహాయిస్తే మిగిలిన ఐదు డిపోల వారీగా బస్సుల రాకపోకలు సాగనున్నాయి. ఈ నెల 7 నుంచి 13 వరకు ఆయా డిపోలనుంచి జేబీఎస్ వరకు ఆర్టీసీ బస్సులు నడుపనున్నారు. ఆదిలాబాద్ డిపో నుంచి 48, నిర్మల్ డిపో నుంచి 82, ఉట్నూర్ డిపో నుంచి 06, ఆసిఫాబాద్ డిపో నుంచి 38, మంచిర్యాల డిపో నుంచి 74 బస్సులను ఏర్పాటు చేశారు. ప్రయాణికులకు బస్సుల ఎసమాచారం ఎప్పటికప్పుడు అందించేందుకు మేనేజర్, అసిస్టెంట్ మేనేజర్, సిబ్బందిని ఏర్పాటు చేయనున్నారు. ఆదిలాబాద్ రీజియన్ నుంచి ఈ నెల 7న 08, 8న 12, 9న 10, 10న 14, 11న 71, 12న 71, 13న 62 బస్సులు నడుపనున్నారు.

హైదరాబాద్ నుంచి ఆదిలాబాద్ రీజియన్‌కు ప్రత్యేక బస్సుల వివరాలు(డిపోల వారీగా)

తేదీ	ఆదిలాబాద్	నిర్మల్	ఉట్నూర్	ఆసిఫాబాద్	మంచిర్యాల
07	07	2	0	02	02
08	02	04	0	02	04
09	02	03	0	02	03
10	02	05	0	02	05
11	15	24	02	10	20
12	15	24	02	10	20
13	10	20	02	10	20

మరిన్ని బస్సులు నడిపే అవకాశం



పండుగ సందర్భంగా ప్రయాణికుల రద్దీ అధికంగా ఉంటే మరిన్ని ప్రత్యేక బస్సులు నడిపే అవకాశం ఉంది. స్పెషల్ బస్సుల్లో రిజర్వేషన్ సౌకర్యం ఉంటుంది. సురక్షిత ప్రయాణానికి ప్రజలు ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణించాలి.

– సోలోమన్, రీజినల్ మేనేజర్, ఆదిలాబాద్

పంట దిగుబడి ఆధారంగా రుణాల మంజూరు

- కలెక్టర్ రాహుల్‌రాజ్



మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

కైలాస్‌నగర్: పంటల దిగుబడి ఆధారంగా రైతులకు అందించే రుణాలపై చర్చించి రాష్ట్రస్థాయి కమిటీకి సిఫార్సు చేయనున్నట్లు కలెక్టర్ రాహుల్‌రాజ్ తెలిపారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఉమ్మడి జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ) ద్వారా వచ్చే ఆర్థిక సంవత్సరంలో స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ రుణాల మంజూరుపై బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పత్తి, సోయాబీన్, వరి, జొన్న వంటి వివిధ పంటల సాగుకు అయ్యే వ్యయాలు, దిగుబడి ఆధారంగా వచ్చే ఆర్థిక సంవత్సరంలో రుణాలు మంజూరు చేస్తామన్నారు. బ్యాంకుల నుంచి పంట రుణాల మంజూరుకై ఆయా పంటల పరిమాణంపై చర్చించి రాష్ట్రస్థాయి కమిటీకి సిఫార్సు చేయడం జరుగుతుందని వివరించారు. సహకార బ్యాంకు సీఈవో శ్రీధర్‌రెడ్డి, ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల సహకార శాఖ అధికారులు మోహన్, శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా వ్యవసాయ, ఉద్యాన శాఖల అధికారులు పుల్లయ్య, శ్రీనివాస్‌రెడ్డి, ఉమ్మడి జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్లు పాల్గొన్నారు.

పీవీటీజీ తెగల అభివృద్ధికి పీఎం జన్‌మాన్ యోజన



మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్ రాజ్

- కలెక్టర్ రాహుల్‌రాజ్

కైలాస్‌నగర్: మారుమూల ప్రాంతాల గిరిజనుల సమగ్రాభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం ప్రధాన మంత్రి జన జాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్ (పీఎం జన్ మాన్ యోజన) పథకాన్ని ప్రవేశపెట్టినట్లు కలెక్టర్ రాహుల్‌రాజ్ తెలిపారు. బుధవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పథకం అమలుపై గిరిజన సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ బి.శివానంద్, ఐటీడీఏ పీవో చాహత్ బాజ్ పాయ్‌లతో కలిసి సమీక్షా నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పీవీటీజీ ఆవాసాల్లో వివిధ పథకాలను మిషన్ మోడ్‌లో పూర్తిస్థాయిలో అందించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పక్కా ఇళ్ల నిర్మాణం, రహదారుల అభివృద్ధి, మొబైల్ మెడికల్ యూనిట్ల ద్వారా ఆరోగ్య పరిరక్షణ, నిరంతర నీటి సౌకర్యం, ప్రతి ఇంటికీ విద్యుత్, అంగన్వాడీ కేంద్రాల ఏర్పాటు, మల్టీపర్పస్ కేంద్రాలు, సోలార్ వీధి దీపాలు, మొబైల్ టవర్లు, ఒకేషనల్ విద్యా కేంద్రాల ఏర్పాటుకు ప్రణాళికలు రూపొందించి అమలు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ నెల 15న ఉట్నూర్ ఐటీడీఏలో ఈ పథకాన్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు ఖుష్బు గుప్తా, శ్యామలాదేవి, జిల్లా అటవీ అధికారి ప్రశాంత్ బాజీరావు పాటిల్, గిరిజన సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ దిలీప్‌కుమార్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

టాస్క్‌ఫోర్స్ పోలీసుల అదుపులో ఇద్దరు యువకులు

లోకేశ్వరం: మండలానికి చెందిన ఇద్దరు యువకులను బుధవారం హైదరాబాద్ ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ పోలీసు అధికారులు అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై సాయికుమార్ తెలిపారు. మండలంలోని గడ్‌చాందకు చెందిన ఒకరు, పిప్రి గ్రామానికి చెందిన మరొకరి ఇళ్లల్లో సోదాలు నిర్వహించిన టాస్క్ ఫోర్స్ అధికారులు అనంతరం ఇద్దరినీ లోకేశ్వరం పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లారు. అక్కడి నుంచి హైదరాబాద్‌కు తీసుకెళ్లారు. సదరు యువకులు ఒక వ్యాపారి నుంచి మత్తు పదార్థాలు కొనుగోలు చేసినట్లు సమాచారం. ఈ విషయమై భైంసా ఎక్సైజ్ సీఐ హైమద్‌ను వివరణ కోరాగా మాకు ఎలాంటి సమాచారం లేదన్నారు.

యువతి ఆత్మహత్యాయత్నం

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీస్ స్టేషన్ పరిధిలోని దస్నాపూర్‌కు చెందిన ఓ యువతి మంగళవారం హార్పిక్ తాగి ఆత్మహత్యకు యత్నించినట్లు మావల ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు. దస్నాపూర్‌కు చెందిన కాంబ్లే ఆకాశ్ అదే కాలనీకి చెందిన యువతిని ప్రేమించాడు. పెళ్లి చేసుకుంటానని చెప్పి నిరాకరించడంతో మనస్తాపం చెందిన యువతి మంగళవారం హార్పిక్ తాగి ఆత్మహత్యకు యత్నించింది. గమనించిన కుటుంబ సభ్యులు రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. యువతి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వలస కార్మికుల బతుకుబాట





నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్, గుండంపెల్లి గ్రామాల మధ్య ఇథనల్ ఫ్యాక్టరీ నిర్మాణం వద్దని రైతులు కొంతకాలంగా పోరాటం చేస్తున్నారు. బుధవారం రైతులు పెద్ద ఎత్తున ఆందోళనకు దిగడంతో ఫ్యాక్టరీ నిర్మాణంలో భాగంగా ఉత్తరప్రదేశ్ నుంచి వచ్చిన వలస కూలీలు నిరాశతో వెనుదిరిగారు. పిల్లాపాపలు, నెత్తిన మూటతో స్వగ్రామాలకు వెళ్తున్న దృశ్యాలను 'సాక్షి' కెమెరా క్లిక్ మనిపించింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్

ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి వాస్తుదోషమట!







బీఆర్ఎస్ ప్రభుత్వం ఎమ్మెల్యేలకు క్యాంపు కార్యాలయాలు నిర్మించింది. ఆదిలాబాద్ అప్పటి ఎమ్మెల్యే జోగు రామన్న ఇక్కడి నుంచే తన కార్యకలాపాలు నిర్వహించారు. కాగా ఇటీవల జరిగిన ఎన్నికల్లో బీజేపీ తరఫున ఎమ్మెల్యేగా ఎన్నికైన పాయల్ శంకర్ గురువారం కొత్త కార్యాలయంలోకి అడుగుపెడుతున్నారు. ఈ నేపథ్యంలో పాత గేట్లను వాస్తు దోషముందనే కారణంతో తొలగించి గోడ నిర్మించారు. కొత్తగా గేట్లను ఏర్పాటు చేశారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్

నిస్వార్థ సేవకు గుర్తింపు

- సావిత్రీబాయి పూలే అవార్డుకు కదేర్ల వీణ ఎంపిక
- పదేళ్లుగా విద్యార్థులకు ఉచితంగా విద్యా బోధన
- ఈ నెల 7న నాగ్‌పూర్‌లో ప్రదానం



కదేర్ల వీణ

కెరమెరి(ఆసిఫాబాద్): నిస్వార్థ సేవకు గుర్తింపు దక్కింది. వందలాది మంది విద్యార్థులకు అక్షర జ్ఞానం అందిస్తూ.. పదేళ్లుగా ఉచిత బోధన చేస్తున్న ఉపాధ్యాయురాలు కదేర్ల వీణ మరో గౌరవం అందుకోనున్నారు. కుమురంభీం జిల్లా కెరమెరి మండలం సావర్‌ఖేడా ప్రధానోపాధ్యాయుడు, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత రంగయ్య సతీమణి వీణ భర్త అడుగుజాడల్లో నడుస్తూ స్వచ్ఛంద సేవల్లో పాలు పంచుకుంటున్నారు. పైసా ప్రతిఫలం ఆశించకుండా పదేళ్లుగా విద్యార్థులకు ఉచితంగా బోధిస్తోంది. వీణ సేవలను గుర్తించిన శ్రీ క్షత్రియ కోసరి మాలి సమాజ్(విదార్భ) ఆమెను సావిత్రీబాయి పూలే అవార్డుకు ఎంపిక చేసింది. పదేళ్లుగా ఉచిత బోధన, సావర్‌ఖేడాలో నివాసం ఉండటం, తెలుగు భాషపై విద్యార్థులకు పరిజ్ఞానం పెంచడం, అక్షరాస్యత పెంపునకు కృషి చేయడం, సెలవు రోజుల్లో కూడా ఇంటి వద్ద బోధన సాగించడం తదితర అంశాలను పరిగణలోకి తీసుకుని విద్యారంలో స్వచ్ఛంద సేవకు గుర్తింపుగా అవార్డు అందించనున్నారు. ఈ మేరకు మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో ఈ నెల 7న జరిగే కార్యక్రమానికి వీణకు ఆహ్వానం పంపించారు. విద్యారంగంలో స్వచ్ఛంద సేవకు గుర్తింపుగా సావర్‌ఖేడా పాఠశాలలో పని చేస్తున్న వీణ.. సావిత్రీబాయి పూలే అవార్డుకు ఎంపికైనట్లు మాలీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పెట్కులే సుకుమార్ బుధవారం 'సాక్షి'కి తెలిపారు. దేశవ్యాప్తంగా వివిధ రంగాల్లో కృషి చేస్తున్న 36 మంది ప్రముఖులకు అవార్డులు ప్రదానం చేసి, సన్మానించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

సావిత్రీబాయి పూలే సేవలు చిరస్మరణీయం

- మాలీ మహా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుకుమార్ పేట్కులే



విగ్రహాలకు పూలమాల వేస్తున్న నేతలు

ఆదిలాబాద్‌రూరల్: స్త్రీ విద్యకు నాంది పలికిన భారతదేశ తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రీబాయి పూలే సేవలు చిరస్మరణీయమని అఖిల భారతీయ మాలీ మహా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుకుమార్ పేట్కులే అన్నారు. బుధవారం సావిత్రిబాయి పూలే 193వ జయంతిని పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ శాఖ కార్యాలయ ఆవరణలోని పూలే దంపతుల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 1848లో మహారాష్ట్రలోని పూణే నగరంలో పూలే దంపతులు స్త్రీల కోసం తొలి మహిళా పాఠశాలను ప్రారంభించి స్త్రీ విద్యకు నాంది పలికారన్నారు. పూలే దంపతుల సామాజిక సేవా కార్యక్రమాలను గుర్తించి భారతరత్న ప్రకటించాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాంబన్న శేండే, రాష్ట్ర కోశాధికారి సతీష్ గురుణులే, యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు ఉమేష్ రావు ఢోలే, జిల్లా అధ్యక్షుడు వాడగురే విజయ్, మాలీ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ అంబేకర్, పట్టణ అధ్యక్షుడు శ్రీను ఆచారి, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు తరలిన క్రీడాకారులు



జెండా ఊపి బస్సును ప్రారంభిస్తున్న డీడీ

ఉట్నూర్‌రూరల్(ఖానాపూర్): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కిన్నెరసానిలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి క్రీడల్లో పాల్గొనేందుకు ఐటీడీఏ ఉట్నూర్ జోన్–1 క్రీడాకారులు బుధవారం ఉట్నూర్ కేబీ ప్రాంగణం నుంచి బయలుదేరి వెళ్లారు. జిల్లా గిరిజన సంక్షేమ శాఖ డెప్యూటీ డైరెక్టర్ ఎం.దిలీప్‌కుమార్ జెండా ఊపి బస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 4 నుంచి 6 వరకు జరిగే పోటీలకు 250 మంది విద్యార్థులు, 26 మంది అధికారులు, కోచ్‌లు, మేనేజర్లు, వ్యాయామ ఉపాధ్యాయులు తరలివెళ్తున్నారన్నారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, అథ్లెటిక్స్, ఆర్చరీ, టెన్నికాయిట్, చెస్, క్యారమ్స్ పోటీలు నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా గిరిజన క్రీడల అధికారి కె.పార్థసారథి, ఏటీడీవో క్రాంతి, ప్రధానోపాధ్యాయులు ఆర్.ఉత్తం, జి.చందన్, కృష్ణారావు, ప్రేందాస్, ఉత్తందాస్, ఏఎస్‌వోలు జె.హేమంత్, ఆర్.గోపాల్, శ్రీనివాస్, రవీందర్, మధుసూదన్, విశ్వనాథ్, కోచ్‌లు సునంద్, శివకృష్ణ, లక్ష్మీరాం, సునీత, స్వప్న, తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో యూనివర్సిటీ ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న నామాల ఆజాద్

ఎదులాపురం: జిల్లాలో యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నామాల ఆజాద్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పీడీఎస్‌యూ జిల్లా కార్యాలయంలో ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం(న్యూ డెమోక్రసీ) రాష్ట్ర ఉపాధ్యక్షుడు అజ్మీర వినోద్ పీడీఎస్‌యూలో చేరగా, ఆయనకు కండువా కప్పి ఆహ్వానించారు. అనంతరం ఆజాద్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ విడుదల చేయక పోవడంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వకుండా పలు విద్యాసంస్థలు వేధింపులకు గురిచేస్తున్నాయని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ రాష్ట్ర నాయకులు మహేందర్, శ్రీరామ్, సాయి, కుమ్ర అశోక్, మహేందర్, విజయ్, అజయ్, జైతు తదితరులు పాల్గొన్నారు.

పోటీల ద్వారా సృజనాత్మక శక్తి పెరుగుదల



మాట్లాడుతున్న ఆర్సీవో గంగాధర్

ఇచ్చోడ: ఇగ్నైట్ పోటీల ద్వారా విద్యార్థుల్లో సృజనాత్మక శక్తి మరింత పెరుగుతుందని గిరిజన గురుకులాల ఉమ్మడి జిల్లా సమన్వయ కర్త గంగాధర్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని గిరిజన గురుకుల బాలుర పాఠశాలలో నిర్వహించిన రీజినల్ లెవల్ ఇగ్నైట్ పోటీలను ప్రారంభించారు. విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యతను చాటుకోవడానికి ఇగ్నైట్ లాంటి కార్యక్రమాలు చక్కగా ఉపయోగపడుతాయన్నారు. కార్యక్రమం ముగింపు రోజు విజేతలకు బహుమతులు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. పోటీల్లో జిల్లాలోని 17 గురుకుల పాఠశాలల నుంచి 2 వేల మంది విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఇగ్నైట్ ప్రోగాం కన్వీనర్ రాజేంద్రప్రసాద్, ప్రిన్సిపాళ్లు రత్నకుమారి, కృష్ణవేణి, ఆదిలాబాద్ స్టార్ క్యాంపెయిన్ ప్రిన్సిపాల్ మారుతి శర్మ, తదితరులు పాల్గొన్నారు.

గిన్నిస్‌లో జిల్లా చిన్నారులకు చోటు



చిన్నారులను సన్మానిస్తున్న అధికారులు

ఆదిలాబాద్: జిల్లా కేంద్రానికి చెందిన బాలకేంద్రం చిన్నారులు గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్‌లో చోటు దక్కించుకున్నారు. హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో భారత్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో డిసెంబర్ 24న నిర్వహించిన కూచిపూడి మహాబృంద నృత్యంలో బాలకేంద్రం చిన్నారులు పాల్గొని గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో చోటు సంపాదించుకున్నారని నృత్య శిక్షకుడు మిట్టు రవి తెలిపారు. ఈ మేరకు మంగళవారం రాత్రి సెక్టోరియల్ అధికారులు ఉదయశ్రీ, నారాయణ చిన్నారులకు జ్ఞాపికలు, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ చిన్న వయసులోనే వరల్డ్ రికార్డులో చోటు దక్కించుకోవడం అభినందనీయమన్నారు. గొప్ప నృత్యకళాకారులుగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బాల కేంద్రం తల్లిదండ్రుల సంఘం ప్రతినిధులు సృజన, శ్రావణ్, రుచిత, అనూష, శిక్షకుడు దత్తు, డ్రాయింగ్ ఇన్‌స్ట్రక్టర్ చంద్రకళాదేవి, ఇందయ్య పాల్గొన్నారు.